మినీ కథ,

# ఛాలెంజ్

అదొక సర్కస్ గుడారం గుడారం అంతా ప్రేక్షకులతో నిండి ఉంది సర్కస్ జరుగుతోంది. ప్రేక్షకులంతా పుత్సాహంగా సర్కస్ చూస్తున్నారు అందమైన అమ్మాయిలు చేసే ఫీట్స్‌ను ఆశ్చర్యంగా చూస్తున్నారు. పొడుగూ, పొట్టి, బఫూన్ల చేష్టలను నవ్వుతూ చూస్తున్నారు.

ఇంతలో మైక్‌లోంచి ఒక ఎనౌన్స్‌మెంటు వినబడింది యిలా—

“ప్రేక్షకుల ముందు యిప్పుడొక వింత ప్రదర్శన ప్రదర్శింపబడుతోంది యిది మీరు యింతవరకూ ఏ సర్కస్‌లోనూ చూడని వింత ప్రదర్శన. మా ప్రేక్షకులను ఒక ఛాలెంజ్ కూడా చేస్తున్నాము. ఈ ప్రదర్శన చూసిన తరువాత మీలో ఎవరైనా ‘అలా’ చెయ్యగలిగితే వారికి 1,116 రూ బహుమతిగా యివ్వబడుతుంది

ప్రేక్షకులు కుతూహలంగా గమనిస్తున్నారు-ఏమిటా యింత వింత ప్రదర్శన అని.

ఆడిటోరియమ్‌లోకి మెరుపు తీగలాంటి అందమైన అమ్మాయి వచ్చింది హాయిగా ఒళ్ళు విరుచుకుంది. హాండ్‌బాగ్ తెరిచింది చిన్న అద్దం, లిప్‌స్టిక్ పైకి తీసింది పెదవులు తడిచేసుకుని అద్దంలో చూసుకుంటూ పెదవులకు ‘లిప్‌స్టిక్’ రాసుకుంటోంది. కాసేపటికి ఆమె పెదాలు బాగా పండిన దొండకాయ బద్దల్లా తయారయ్యాయి

ఇంతలో స్టేజీమీదకు ఒక బోను తీసుకు వచ్చారు దానిలో భయంకరమెన సింహం ఉంది. బోను తలుపు తెరిచారు. గర్జిస్తూ బయటకు వచ్చింది సింహం. నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ అమ్మాయి దగ్గరకు వెళ్ళింది

ప్రేక్షకులు విస్మయంగా చూస్తున్నారు.

సింహం అమ్మాయి దగ్గరకు వెళ్ళింది. ముందు కాళ్ళు రెండూ ఎత్తి అమ్మాయి భుజం మీద వేసింది. అమ్మాయి ముఖంలో ముఖం పెట్టింది నాలుకతో ఆమె పెదాలకు వున్న ‘లిప్‌స్టిక్’ని నాకి వేసింది. ‘లిప్‌స్టిక్ పోయిన ఆమె పెదాలు తిరిగి తెల్లగా అయిపోయాయి.

ప్రేక్షకులు కరతాళధ్వనులు చేశారు.

“చూశారు కదూ? యిప్పుడు మీలో ఎవరైనా ‘యిలా’ చెయ్యగలిగితే ముందుకు రండి. వెయ్యి నూట పదహార్లు బహుమతి గెలవండి,” అని వినబడింది మైకులోంచి

నిముషం గడిచింది. ఎవరూ ముందుకు రాలేదు రెండు నిముషాలు గడిచాయి. ఊహూఁ ఎవ్వరూ ముందుకు రాలేదు. మూడో నిముషంలో ఒక వ్యక్తి స్టేజి దగ్గరకు వచ్చాడు

“వెరీగుడ్! యింత మందిలో ఒక్క ధైర్యస్థుడు కూడా లేడేమోననుకున్నాము మీరున్నారు రండి. ఆ టేబుల్ మీద అద్దం, లిప్‌స్టిక్ ఉన్నాయి. పెదాలకు ‘లిప్‌స్టిక్’ రాసుకోండి. సింహం వస్తుంది.”

ఆ వ్యక్తి గాభరా పడుతూ అన్నాడు.

“సింహం ఎందుకు? అమ్మాయిని పిలవండి. సింహం చేసినట్లు నేనూ చెయ్యగలను.”

—కోనే నాగవెంకట అంజనేయులు